
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం ၊ 11 ၊ జూలై ၊ 2025



ఒకరు లేదా ఇద్దరు చాలు!



అంతకు మించితే పోషణ భారమే.. ● 'సాక్షి' సర్వేలో జంటల నోట ఇదే మాట ● సంతానం విషయంలో నేటి తరంలో స్పష్టత

ఖమ్మంసహకారనగర్/కొత్తగూడెం అర్బన్: నానాటికీ జనాభా పెరుగుతోంది. ఇదే సమయాన జీవన వ్యయమూ అధికమవుతోంది. ఫలితంగా గతంతో పోలిస్తే యువత భావాల్లో మార్పులు వస్తున్నాయి. జనాభా పెరుగుదలకు తోడు పోషణ భారంతో సంతానం విషయంలో పెళ్లికి ముందు నుంచే స్పష్టతకు వస్తున్నారు. ఒకరు లేదా ఇద్దరు సంతానంతో సరిపెట్టుకోవాలని నిర్ణయించుకుంటున్నారు. ఇద్దరూ ఉద్యోగం చేస్తే తప్ప కుటుంబాలు గడవని పరిస్థితుల్లో పిల్లల పోషణ కష్టమవుతుందనే భావనతో ఒక సంతానానికే పరిమితమవుతున్నారు. ఇంకొందరు మాత్రం కుటుంబ పెద్దల ఒత్తిడితో రెండో సంతానానికి జన్మనిస్తున్నారు. అయితే, ఒకే సంతానంతో భవిష్యత్‌లో వృద్ధుల సంఖ్య పెరిగి యువజనుల సంఖ్య తగ్గుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఇద్దరికి మించి సంతానం దాటితే విద్య, వైద్యం.. ఇతర అంశాలతో పాటు ఉద్యోగాల ఒత్తిడితో వారి బాగోగులు చూడడం ఎలా అన్న భావనతో జంటలు లెక్కకు మిక్కిలి సంతానానికి వెనుకడుగు వేస్తున్నాయి.

తోడు ఉండాలని..

నేటి తరంలో చాలా జంటలు ఒకే సంతానానికి పరిమితమతున్నా, ఇంకొందరు మాత్రం ఇద్దరు పిల్లలైతేనే తోడుగా ఉంటారనే భావనతో రెండో సంతానానికి మొగ్గు చూపుతున్నారు. అయినా పోషణ విషయంలో ఆందోళన వ్యక్తమవుతోంది. నేడు(శుక్రవారం) ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో 60జంటలను నాలుగు ప్రశ్నలతో సర్వే చేయగా సంతానం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇందులో సంతానం ఒకరే చాలా అన్న ప్రశ్నకు.. ఎక్కువ మంది ఇద్దరైతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఒకే సంతానంతో వారిలో ఒంటరితనం ఎదురవుతుందా అన్న ప్రశ్నకు అలాంటిదేమీ ఉండదని, అయినా తప్పదని సమానంగా సమాధానాలు వచ్చాయి. ఎక్కువ సంతానం వద్దనడానికి పోషణ, సంరక్షణ భారమే కారణమా అని అడిగితే అవుననే ఎక్కువమంది బదులిచ్చారు. యువజనం తగ్గనుండడంతో ఇద్దరినైనా కనాలన్న సూచనలపై ఆరాతీస్తే ఆలోచించాల్సిన అంశమేనని చెప్పడం గమనార్హం.

ఇద్దరైతేనే ధైర్యం



పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆదాయం పెరగకున్నా ఖర్చులు పెరిగాయి. అందుకే చాలామంది ఒకే సంతానం చాలని భావిస్తున్నారు. అలా అయితే వారికి ఒంటరితనం ఎదురవుతుంది. ఇద్దరైతే పరస్పరం తోడుగా నిలుస్తారు, ధైర్యంగా ఉంటారు.

– బి.శంకర్ – లక్ష్మి కొత్తగూడెం

ఇద్దరు తప్పనిసరి..



ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరు పిల్లలు ఉండడం మంచిది. తద్వారా ఒకరికి ఒకరు తోడు నిలిస్తే ధైర్యం, భరోసాగా ఉంటుంది. ఇప్పటి ఖర్చులను బేరీజు వేసుకుంటే ఇద్దరిని పోషించడం కష్టమే. అయినా మంచీ, చెడుల్లో సహకరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

– ఎస్.శ్రీనివాస్ – మౌనిక, ఖమ్మం

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో చండీహోమం



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గురువారం చండీ హోమం నిర్వహించారు. ముందుగా మేళతాళాలు, వేదమంత్రాలతో స్వామివారిని ఊరేగింపుగా హోమశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతిపూజ అనంతరం చండీహోమం గావించి చివరకు పూర్ణాహుతి చేశారు. హోమంలో పాల్గొన్న 21 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కాగా, గురువారాన్ని పురస్కరించుకుని పెద్దమ్మతల్లి అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో 'జారె'



మాట్లాడుతున్న జారె ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్ : విద్య – ఆరోగ్యంపై ఢిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ సదస్సుకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సదస్సుకు రాష్ట్రం నుంచి ఎమ్మెల్యే ఒకరికే అవకాశం దక్కడం విశేషం. ఈ మేరకు తొలిరోజు సదస్సులో ఆరోగ్య అంశంపై ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సేవల గురించి వివరించారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా మెరుగైన వైద్య సేవలు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

భారీగా గంజాయి స్వాధీనం



భద్రాచలంలో పట్టుబడిన గంజాయి, నిందితులతో ఎక్సైజ్ అధికారులు

భద్రాచలంటౌన్ : ఒడిశా నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. సీఐ సీహెచ్ శ్రీనివాస్ కథన ప్రకారం.. కూనవరం రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వాహనాలను ఆపి తనిఖీ చేయగా 8.85 కిలోల గంజాయి లభించింది. వారిని విచారించగా హైదరాబాద్‌కు చెందిన ముడావత్ మోహన్ నాయక్, గంట పవన్‌కుమార్, రమావత్ గణేష్, అయ్యప్ప నాయక్, ఆకుల దర్శత్ చంద్రాలు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించామని, పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4.5 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

టేకులపల్లిలో 4 కిలోలు..

టేకులపల్లి: అక్రమంగా గంజాయి తరలిస్తుండగా టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. సీఐ టి.సురేష్, ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా ఏఆర్ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ దుంప ప్రసాద్ జల్సాలకు అలవాటు గంజాయి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒడిశా నుంచి గంజాయి తరలిస్తుండగా వెంకట్యాతండా వద్ద వాహన తనిఖీల్లో పట్టుకున్నామని, 4.130 కిలోల గంజాయితో పాటు ఆటో, మొబైల్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి విలువ రూ.2.06 లక్షలు ఉంటుందని తెలిపారు.

దమ్మక్కకు నీరాజనం



వెంకటాపురంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



భద్రాచలంలో దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షిణ

- దేవస్థానం ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ
- కమనీయంగా గోవిందరాజస్వామి కల్యాణం

భద్రాచలం : భద్రగిరి రామయ్య మూలమూర్తులకు నీడనిచ్చి, పూజలందించిన అపర భక్తురాలు దమ్మక్కకు వైభవంగా నీరాజనం పలికారు. శ్రీ సీతారామచంద్రస్వామి వారి భక్తురాలిగా ఖ్యాతిగాంచిన పోకల దమ్మక్కకు.. ఆషాఢ పూర్ణిమ రోజున గిరిజనుల సమక్షంలో దమ్మక్క సేవా యాత్ర పేరిట దేవస్థానం ఆధ్వర్యంలో 2014 నుంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆషాఢ పూర్ణిమ కావడంతో ఈ ఉత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని చెట్టు వద్ద గల దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, కోలాటాలు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల నడుమ చప్టా దిగువన ఉన్న భక్త రామదాసు విగ్రహం వద్ద, సీతారామ ఆఫీసర్స్ క్లబ్ వద్ద నున్న శబరి విగ్రహం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేసి పూలు, పండ్లు సమర్పించారు. రామదాసు కీర్తనలతో నగర సంకీర్తన చేశారు. అనంతరం దేవస్థానంలో రామయ్యకు దమ్మక్క తరఫున పలు రకాల పండ్లు, పూలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ, ప్రధానార్చకులు విజయరాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో రామయ్య కల్యాణం..

కాగా, దమ్మక్క సేవా యాత్రను పురస్కరించుకుని ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో రామయ్య కల్యాణాన్ని జరిపించారు. ప్రచార రథంలో స్వామివారు వెళ్లగా భక్తులు ఘన స్వాగతం పలికారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి వారిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా తమ ముందుకు వచ్చిన భద్రాద్రి రామయ్యకు భక్తులు మొక్కులు సమర్పించారు.

కమనీయంగా గోవిందరాజ స్వామి కల్యాణం..

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి అనుబంధ ఆలయం, తాతగుడి సెంటర్‌లో వేంచేసి ఉన్న గోవిందరాజ స్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీదేవి – భూదేవి సమేత గోవిందరాజ స్వామి వారికి దేవస్థానం తరఫున అధికారులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

కళ తప్పిన సేవాయాత్ర..

భద్రాచలంలో నిర్వహించిన దమ్మక్క సేవా యాత్ర పూర్తిగా కళ తప్పింది. గతంలో వివిధ గ్రామాలను ప్రత్యేక బస్సుల ద్వారా గిరిజనులను ఒకరోజు ముందుగానే భద్రాచలం తీసుకొచ్చి వారికి వసతి, భోజన సౌకర్యాలు కల్పించేవారు. సంప్రదాయ నృత్యాలతో గిరిజనులు సైతం ఉత్సాహంగా పాల్గొని స్వామి వారికి పూలు, పండ్లు సమర్పించేవారు. వేడుక అనంతరం ఆలయం తరఫున గిరిజనులకు వస్త్రాలు అందించేవారు. కానీ ఈ ఏడాది అలాంటివేమీ లేకుండానే సాదాసీదాగా వేడుక నిర్వహించారు. కాగా, గురువారం జరిగిన సేవా యాత్రలో గిరి ప్రదక్షిణను ఆదివాసీ నాయకులు పూనెం కృష్ణ, వీరభద్రం అడ్డుకొని నిరసన తెలిపారు. గిరిజన సంఘాలను విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బైఠాయించారు. దేవస్థానం అధికారులు గిరిజనులను అవమానించారని ఆరోపించారు.

'ఉద్దీపకం'తో గుణాత్మక విద్య

ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ, జీపీఎస్ విద్యార్థులకు ఉద్దీపకం వర్క్ బుక్‌తో గుణాత్మక విద్య అందించే అవకావం ఉంటుందని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక బీఈడీ కళాశాలలో ఏహెచ్‌ఎస్, ఏపీఎస్, జీపీఎస్ పాఠశాలల ఎస్జీటీలకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీస సామర్థ్యాలు అర్థమయ్యేలా నిష్ణాతులైన ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో వర్క్‌బుక్‌లను రూపొందించామని చెప్పారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు గుణకారాలు, భాగాహారాల్లో నైపుణ్యం పెంచేలా ఉపకరిస్తోందని వివరించారు. 1, 2 తరగతుల వారికి తెలుగు, 3 నుంచి 7వరకు ఇంగ్లిష్, గణితం వర్క్‌బుక్‌లు రూపొందించామని చెప్పారు. ఉపాధ్యాయులు శిక్షణను సద్వినియోగం చేసుకుని, చదువులో వెనుకబడిన విద్యార్థులను మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం బీఈడీ, డీఈడీ కళాశాలల డార్మెటరీ గదులను పరిశీలించారు. ఏమైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరునాయక్, ఏసీఎంఓలు రమేష్, శ్రీరాములు, ఏటీడీఓలు అశోక్ కుమార్, రాధమ్మ, సీఆర్పీలు వరబాబు, శంకర్, మోతీలాల్, అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని, వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని పీఓ రాహుల్ సూచించారు. మారుమూల మండలాల సబ్ యూనిట్ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి, బాధితులకు చికిత్స చేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలోని 113 హైరిస్క్ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు వహించేలా ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ఉన్నట్లు తేలితే మందులు అందించడంతో పాటు ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, ఏడీఎంహెచ్‌ఓ చైతన్య, మలేరియా అధికారి స్పందన తదితరులు పాల్గొన్నారు.

మరో పోరాటానికి సిద్ధం కావాలి

- అభివృద్ధి చెందుతున్న దశలో కాంగ్రెస్ చేతికి రాష్ట్రం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



కొత్తగూడెంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత, పక్కన నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అనేక పోరాటాలు, ప్రాణత్యాగాలతో సాధించుకున్న తెలంగాణ.. అభివృద్ధి చెందుతున్న దశలో కాంగ్రెస్ చేతికి వెళ్లి తిరోగమనంలో పయనిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కొత్తగూడెం క్లబ్‌లో గురువారం నిర్వహించిన తెలంగాణ జాగృతి సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రం ప్రగతిబాటలో పయనించేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 18 నెలల కాలంలో సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కసారి కూడా జై తెలంగాణ అనలేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు విస్మరించారని, పెన్షన్లు పెరగక పోగా, రైతులందరికీ రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా మారిందని, చర్చకు సిద్ధమన్న సీఎం.. రమ్మంటే తోకముడిచి పారిపోతున్నాడని ఎద్దేవా చేశారు. సింగరేణిని ప్రైవేటీకరించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 ఇస్తామన్న హామీని అటకెక్కించారని విమర్శించారు. రాష్ట్రాల పునర్విభజన సందర్భంగా ఏపీలో విలీనమైన ఐదు పచాయతీలను తెలంగాణలో కలపాలని అక్కడి సీఎంకు లేఖ రాశామన్నారు. భద్రాచలం రామాలయం ఈఓ రమాదేవిపై జరిగిన దాడిని ఆమె ఖండించారు. కాగా, సీఐటీయూ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి డి.వీరన్న తన అనుచరులతో కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు.

'సీతారామ' తక్షణమే పూర్తి చేయాలి

పాల్వంచ/పాల్వంచరూరల్ : పెండింగ్‌లో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ పనులు తక్షణమే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. పాల్వంచలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా సీతారామ ప్రాజెక్ట్ పనులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రూప్‌సింగ్, సదానందం గౌడ్, మాధవి, పవన్ నాయక్, సింధు తపస్వి, హుస్సేన్, కాపు కృష్ణ, నవతన్, కిరణ్‌మార్, వరప్రసాద్, కాంపెల్లి కనకేష్, అనుదీప్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

రేగాకు పరామర్శ..

కరకగూడెం: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తల్లి నర్సమ్మ బుధవారం మృతిచెందగా, కవిత గురువారం కుర్నవల్లిలో రేగాను పరామర్శించారు. నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి పోరాటం వల్లే రాష్ట్ర కేబినెట్ బీసీ బిల్లుకు ఆమోదం తెలిపిందని కవిత అన్నారు. కుర్నవల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం శుభ పరిణామమని అన్నారు. ఈ బిల్లు దేశానికి కూడా దారి చూపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'కొత్త పార్టీ పెడుతున్నారా' అని విలేకరులు కవితను ప్రశ్నించగా 'జై తెలంగాణ' అంటూ సమాధానమిచ్చారు.

తాతా, వనమా పరామర్శ..

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఆయన తల్లి నర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

గోదావరి పెరిగి'నది'



భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. గురువారం ఉదయం 23.3 అడుగులు ఉన్న నీటిమట్టం రాత్రికి 26 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో శుక్రవారానికి మరో రెండడుగుల మేర పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు నదిలోకి దిగకుండా చర్యలు చేపడుతున్నారు. – భద్రాచలంటౌన్

క్లుప్తంగా

ఎరువుల దకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఏఓ బాబూరావు

దమ్మపేట : మండల పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని దమ్మపేట, మొద్దులగూడెం, నాచారం, నాగుపల్లి గ్రామాల్లోని దుకాణాల్లో స్టాక్, రికార్డులను తనిఖీ చేశారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖర రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్..

దమ్మపేట : మండలంలోని దురదపాడు, లింగాలపల్లి గ్రామాల్లో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో గురువారం ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. 147 ఎకరాల విస్తీర్ణంలో 63 మంది రైతుల వ్యవసాయ క్షేత్రాల్లా మొక్కలు నాటారు. ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ రాధాకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్లు సతీష్, అప్పారావు, అర్షద్, రైతులు సోయం ప్రసాద్, మడకం రాజేష్, ఎర్రా వసంతరావు, శేషుబాబు, కాసాని నాగప్రసాద్, మంగేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రాచలం ఆస్పత్రిలో ఖరీదైన శస్త్రచికిత్స



శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో గురువారం ఓ మహిళకు ఖరీదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన రమణ అనే మహిళకు గాల్ బ్లాడర్‌లో రాళ్లు ఏర్పడటంతో ఈ నెల 9న ఆస్పత్రిలో చేరింది. దంతో వైద్యులు రామకృష్ణ, వెంకట్, నిఖితలు ల్యాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ నిర్వహించి గాల్ బ్లాడర్ తొలగించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా, జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఇలాంటి శస్త్రచికిత్స నిర్వహించడం ఇదే తొలిసారి అని సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. ఇదేచికిత్స ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తే రూ. 2 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొన్నారు.

నిందితుడి కోసం గాలింపు

నేలకొండపల్లి: అత్యాచారం కేసులో నిందితుడి కోసం భద్రాద్రి జిల్లా గుండాల పోలీసులు గాలిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన కుంభం వీరబాబు 2019లో గుండాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా, కోర్టు వాయిదాలకు హాజరుకావడం లేదు. దీంతో గురువారం గుండాల సీఐ ఎల్.రవీందర్, సిబ్బంది రాజేశ్వపురం వచ్చి ఆయన ఆచూకీ కోసం ఆరా తీశారు. ఆగస్టు 13లోగా న్యాయస్థానంలో హాజరయ్యేలా చూడాలని బంధువులకు సూచించారు. కాగా, వీరబాబు ఆచూకీ తెలిసిన వారు 87126 82082, 87126 82084 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

కలిసుంటే.. కలదు సుఖం!

ఉమ్మడి కుటుంబం ఐక్యతకు ప్రతీక.. కష్టసుఖాలను పంచుకునే వేదిక. బంధం, అనుబంధం, ప్రేమానురాగాలతో బృందావనాన్ని తలపిస్తుంది. తాతయ్య, నాయనమ్మ, తల్లిదండ్రులు, బాబాయిలు, చిన్నమ్మలు, మేనత్తలు, మామలు, అన్నయ్యలు, తమ్ముళ్లు, అక్కలు, చెల్లెళ్లు, వదినలు, మరదళ్లు, బావలు, బావమరుదులతో ఆనందంగా జీవిస్తుంటారు. పూర్వం నుంచి దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పటికీ కాలక్రమంలో మార్పులు వచ్చాయి. స్వేచ్ఛ లేదని, ప్రైవసీ కొరవడుతుందనే భావనతో వేరుగా జీవిస్తుండటంతో దాదాపు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిపోయే దశకు చేరగా.. ఇంకా ఒకటో, రెండో కుటుంబాలు అక్కడక్కడా ఉమ్మడిగా జీవనం సాగిస్తున్నాయి. ఆ కుటుంబాల గురించి తెలుసుకుందాం. –ఖమ్మంగాంధీచౌక్



కుటుంబ సభ్యులతో సయ్యద్ ఖాజాహుస్సేన్

ఉమ్మడి కుటుంబాలతోనే జీవన మాధుర్యం

- కష్టసుఖాల్లో ఒకరికి అందరూ.. అందరికీ ఒకరు
- ప్రేమానురాగాలు, వ్యవహారిక జ్ఞానం ద్విగుణీకృతం

ఒంటరితనం దూరం.. ప్రయోజనాలనేకం

ఉమ్మడి కుటుంబతో ఒంటరితనం దూరమవుతుంది. కుటుంబ వాతావరణం పిల్లల్లో సానుకూల ప్రభావం చూపుతుందని, వ్యవహారిక జ్ఞానం పెంచుతుందని, మానసిక పరిపక్వతకు దోహదం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ప్రతి జంట 'మేమిద్దరం.. మాకొక్కరు'అనే విధానాన్ని అనుసరిస్తున్నారు. దీంతో తోబుట్టువులు లేకపోవడంతో చిన్నారులు ఎక్కువ శాతం మంది ఒంటరితనానికి లోనవుతున్నారనే నిపుణుల పరిశీలనలో తేలింది. ఆడుకునేందుకు తమ ఈడు పిల్లలు లేకపోవడం, ఒక్క సంతానమని తల్లిదండ్రులు గారాబంగా, బయటకు వెళ్లనీయకుండా పెంచడంతో ఒంటరితనానికి లోనవుతున్నారు. ఉమ్మడి కుటుంబంలో ఈ సమస్య రాదని నిపుణులు చెబుతున్నారు. చిన్నాన్న, పెదనాన్న పిల్లలతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఒంటరిగా చదువుకోలేని పిల్లలు ఉమ్మడిగా చదువులో కూడా రాణిస్తారు. నాయనమ్మ, తాతయ్యలతో ఉంటే నీతికథలు వింటూ అనుభవాలను పెంచుకునే అవకాశం ఉంటుంది. ఆనందంగా గడిపే పిల్లలు శారీరకంగా, మానసికంగా పటిష్టంగా ఉంటారు. పెద్దల సలహాలు లభిస్తాయి. బాధలో ఉన్నప్పుడు ఓదార్పు, అభయం లభిస్తుంది. మహిళలకు గౌరవం, హుందాతనం లభిస్తుంది.

■ మా కుటుంబంలో 40 మంది..

బూర్గంపాడు: కరకగూడెం గ్రామానికి చెందిన సయ్యద్ ఖాజాహుస్సేన్, రహిమున్నీషా బేగం దంపతులకు తొమ్మిదిమంది సంతానం. వీరిలో ఏడుగురు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. కుటుంబ పెద్ద సయ్యద్ ఖాజాహుస్సేన్ పదిహేను ఎకరాల భూమిని సాగు చేసుకుంటూ అందరినీ చదివించి పెద్దచేశాడు. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించి ప్రయోజకులుగా మార్చాడు. కుమారులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవళ్లు, మనవరాళ్లతో కుటుంబ సభ్యులు 40కి చేరారు. కుమారులు ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడ్డారు. మనవళ్లు, మనవరాళ్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. మనవళ్లు, మనవరాళ్లు, ముని మనవళ్లు, ముని మనవరాళ్లతో సంతోషంగా కాలం గడుపుతున్నానని, కుటుంబం తనను ఎంతో ఆప్యాయతతో చూసుకుంటోందని ఖాజాహుస్సేన్ తెలిపాడు. కాగా అతని భార్య రహిమున్నీషా పదేళ్ల క్రితం మృతి చెందింది.

■ అంతా కలిస్తే పండుగే..



మోకాళ్ల కన్నయ్య కుటుంబం

ఇల్లెందు: ఇల్లెందు మండలం మాణిక్యారం పంచాయతీ ఎల్లాపురానికి చెందిన మోకాళ్ల కన్నయ్య–చుక్కమ్మలకు ఎనిమిది మంది సంతానం. ఆరుగురు కుమారులు. ఇద్దరు కుమార్తెలు. వారి పిల్లలతో మొత్తం కుటుంబంలో 33 మంది ఉన్నారు. శుభకార్యాలు జరిగితే సందడి నెలకొంటుంది. ఏడాదికి ఒకసారైనా అంతా ఒక చోట కలిసి పండుగ చేసుకుంటుంటారు. కన్నయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ తర్వాత పెద్ద కుమారుడు, మాజీ సర్పంచ్ మోకాళ్ల కృష్ణ కుటుంబ బాధ్యతలు స్వీకరించారు. మూడో తరంలో 16 మంది సంతానం. నేటి వరకు తోబుట్టువుల మధ్య పొరపొచ్చాలు లేకుండా జీవనం సాగిస్తున్నారు. ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని, ఏ కష్టం వచ్చినా సంతోషం వచ్చినా అందరూ ఒక చోట చేరి చర్చించుకుని ముందుకు సాగుతామని కృష్ణ తెలిపాడు. దీంతో గ్రామంలో గౌరవం కూడా ఉందని పేర్కొన్నాడు.

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

ఆర్థిక పరిస్థితుల వల్లే..

- చిన్న కుటుంబాలుగా మారిన సమాజం
- అమ్మ, నాన్న, ఒక్కరిద్దరు పిల్లలతో జీవనం



ఇల్లెందురూరల్/నేలకొండపల్లి: సమాజంలో ఆర్థిక పరిస్థితులు, స్వార్థం, నేను అనే భావన వంటి కారణాలతో ఉమ్మడి కుటుంబాలు కాస్త చిన్న కుటుంబాలుగా మారిపోయాయి. నేడు కుటుంబం అంటే భార్య, భర్త, వారి ఒకరిద్దరు సంతానం మాత్రమే. ఇలాంటి కుటుంబాలు ఆర్థికంగా బలపడినా మానసికంగా మాత్రం బలహీనపడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు ఆయా కుటుంబాల పిల్లల మానసిక పరిపక్వత ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. చిన్న కుటుంబాల్లో మంచి మాటలు చెప్పే పెద్దలు లేకపోవడంతో పిల్లలు టీవీ, సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారు. ఇది వారి ఆరోగ్య స్థితిగతులపై కూడా ప్రభావం చూపుతోంది.

■ నా కష్టం పిల్లలు పడకూడదని..



కుమార్తె బిందుతో చింత రామనాథం - భారతి

మాది పెద్ద కుటుంబం. ఎనిమిది మంది సభ్యులం. ఇంత మందిని పోషించడం అమ్మనాన్నలకు ఇబ్బందిగా ఉండేది. చాలా రోజులు ఆహారం లేక ఉపవాసంతోనే నిద్రించేవాళ్ళం. ఆ పరిస్థితి నా పిల్లలకు ఎదురవ్వొద్దని నా చిన్నతనంలోనే నిర్ణయించుకున్నా. నాకు రామనాథంతో పెళ్లయ్యాక భర్తను ఒప్పించి కొడుకైనా, కూతురైనా ఒక్కరే చాలనుకున్నాం. కుమార్తె జన్మించింది. ఉన్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ, రెక్కల కష్టంతో కుమార్తెను సుఖంగా పోషించుకుంటున్నాం. ఆమెను ప్రయోజకురాలిని చేయాలన్నదే మా లక్ష్యం.

– చింత భారతి – రామనాథం, కుంజవారిగూడెం, ఇల్లెందు మండలం

■ చాలా సంతోషంగా ఉన్నాం



కుమారుడు శ్రీలలిత్ సారితో శ్రీనివాస్ - లావణ్య

నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాస్–లావణ్య దంపతులు ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సంతానం ఒక్కరు చాలని నిర్ణయించుకున్నారు. వీరికి శ్రీ లలిత్ సారి ఉన్నాడు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, పిల్లలకు కనీస అవసరాలు తీర్చడం కోసం అధిక మొత్తాలను వెచ్చించాల్సి రావడం వంటి సమస్యలను గుర్తించి ఒక్కరు చాలనకున్నామని, ఒక్క బాబుతో సంతోషంగా జీవనం సాగిస్తున్నామని ఆ దంపతులు తెలిపారు. ఆర్థిక భారం పెరగడంతో చాలా మంది దంపతులు ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనడంపై ఆసక్తి చూపించడం లేదు. విద్య, వైద్యం, ఆహారం, బట్టలు తదితర అవసరాల కోసం భారీగా ఖర్చు పెరుగుతుంది. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలలో ఇదో పెద్ద సమస్యగా మారుతోంది. దీంతో పాపైనా, బాబైనా ఒక్కరితోనే సరిపెట్టుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన గద్దల రాధాకృష్ణ(30) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బైక్‌పై కొత్తగూడెం వెళ్తొస్తుండగా అన్నపురెడ్డిపల్లి మండలం బుచ్చన్నగూడెం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

చర్ల: మండలంలోని సుబ్బంపేటకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కనితి శాంతమూర్తి (30) గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామంలోని ఓ ఇంటి వద్ద వాల్ కటింగ్ మిషన్‌తో గోడకు రంధ్రాలు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. అతన్ని కాపాడే ప్రయత్నంలో ఇంటి యజమాని సామ్రాజ్యం కూడా విద్యుదాఘాతానికి గురైంది. ఇద్దరిని కొయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, శాంతమూర్తి అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



తెగిన పడిన మహిళ కాలు

చంద్రుగొండ: రోడ్డు ప్రమాదంలో గురువారం ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అన్నపురెడ్డిపల్లికి చెందిన గుండు మాధవి తోటి కూలీలతో కలిసి ఆటోలో పనికి వెళ్లి తిరిగి వస్తోంది. ఈ క్రమంలో అన్నపురెడ్డిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ పక్కన కూర్చున్న మాధవి కాలు తెగి దూరంగా పడింది. ఆటోలోని మిగతా కూలీలకు ఎలాంటి గాయాలూ కాలేదు. ఎస్సై చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రురాలిని తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లభ్యంకాని కార్మికుడి ఆచూకీ

మణుగూరు టౌన్: రేగులగండి చెరువులో గల్లంతైన సింగరేణి కార్మికుడు సుంకరి శ్రీనివాస్ ఆచూకీ గురువారం కూడా లభ్యం కాలేదు. బుధవారం ఆటవిడుపుగా వెళ్లి శ్రీనివాస్ చెరువులో గల్లంతైన విషయం విదితమే. అధికారులు, జాలర్లు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఫైర్ రెస్క్యూ బృందాలు చెరువులో గాలించినా ఫలితం లేకపోయింది. కాగా గాలింపు చర్యలను సీఐ నాగబాబు, రెవెన్యూ, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు.